సాక్షి
కాకినాడ
శుక్రవారం । 14 । జూన్ । 2024



ఉపాధి వేటలో అగ్నికి ఆహుతి

కువైట్‌లోని మాంగాఫ్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో పెరవలి మండలానికి చెందిన ఇద్దరు సజీవ దహనమయ్యారు. - వివరాలు 8లో▸



ఘాటెక్కిన రేటు

దైనందిన జీవితంలో ప్రధానంగా వినియోగించే నిత్యావసర వస్తువుల్లో ఒకటైన ఉల్లి ధర రోజు రోజుకు ఘాటెక్కుతోంది. - వివరాలు 8లో▸

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

బుచ్చిబాబుకు పేర్ని నాని పరామర్శ



బుచ్చిబాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రి నాని

కొత్తపల్లి: పితృవియోగంతో బాధ పడుతున్న ఉప్పెన సినిమా దర్శకుడు సానా బుచ్చిబాబును కొత్తపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని గురువారం పరామర్శించారు. బుచ్చిబాబు తండ్రి మృతికి ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. బుచ్చిబాబును పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు, ఉమ్మిడి జాన్ తదితరులున్నారు.

16న అరసం మహాసభ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ప్రథమ మహాసభ ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మహాసభ కన్వీనర్ వేదుల శ్రీరామశర్మ ఆధ్వర్యాన జరిగే సభకు అరసం కోనసీమ జిల్లా గౌరవాధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు అధ్యక్షత వహిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొని అభిభాషణ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం, కవితల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతాయని పేర్కొన్నారు.

కూలగొట్టారు.. తిరిగి కట్టారు



పునరుద్ధరించిన శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే వాసు, మాజీ ఎమ్మెల్సీ అప్పారావు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రదేశంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఈ నెల 7వ తేదీన రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో ఆయన అనుచరులు, టీడీపీ కార్యకర్తలు కూల్చివేసిన విషయం తెలిసిందే. దీనిని ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్సీ అప్పారావు సొంత ఖర్చులతో తిరిగి ఏర్పాటు చేశారు. దీంతో పాటు గతంలో మాజీ ఎంపీ మురళీమోహన్ హయాంలోని శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ఎమ్మెల్యే వాసు మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఆ సమయంలో అప్పటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీ మార్గాని భరత్ రామ్ పేర్లతో అక్కడ ఉన్న శిలాఫలకాన్ని వాసు అనుచరులు, టీడీపీ కార్యకర్తలు గునపాలు, సుత్తులతో ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావు ఈ శిలాఫలకాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. దీంతో పాటు మాజీ ఎంపీ మురళీమోహన్ హయాంలోని శిలాఫలకాన్ని కూడా అమర్చారు. ఎవరైనా చేపట్టిన అభివృద్ధి పనులను తర్వాత వచ్చిన వాళ్లు కొనసాగించడం, ముందు వేసిన శిలాఫలకాలను ఉంచడం సహజమని, అయితే మురళీ మోహన్ హయాంలో వేసిన శిలాఫలకాన్ని పక్కన పడేశారని అప్పారావు ఈ సందర్భంగా అన్నారు. ఇది తమ పార్టీకి చెందిన వాసిరెడ్డి బాబీకి బాధ కలిగించిందని, దీంతో కొత్త శిలాఫలకాన్ని ఆయన అనుచరులు కోపంతో పగులగొట్టారని సమర్థించుకున్నారు. అయితే, ఇది మంచి పద్ధతి కాదని చెప్పి, రెండు శిలాఫలకాలనూ సొంత ఖర్చుతో ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల రాబడి రూ.96.98 లక్షలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గురువారం లెక్కించగా రూ.96.98 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. 28 రోజులకు లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.77,65,489, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.19,32,588 వచ్చినట్లు తెలిపారు. బంగారం 33 గ్రాములు, వెండి 580 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.2,53,803 వచ్చినట్లు తెలిపారు. ఏసీ డి.నాగ మల్లేశ్వరరావు, మండపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓ ఎస్.కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

వేటకు వేళాయె..

- నేటి అర్ధరాత్రితో ముగియనున్న వేట నిషేధం
- మత్స్యకార గ్రామాల్లో సందడి
- బోట్లలో ఐస్ వేసుకుని వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు
- గంగమ్మ కరుణించాలని వేడుకోలు



కాకినాడ కుంభాభిషేకం రేవు వద్ద సముద్రంలో చేపల వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

కాకినాడ రూరల్: ఎగసిపడే అలల సవ్వడితో పోటీ పడేలా.. సాగర తీరంలో గంగపుత్రుల సందడి మళ్లీ ఆరంభం కానుంది. దాదాపు రెండు నెలలుగా తీరంలో లంగరేసుకుని కదలకుండా ఉన్న బోట్లు.. కట్లు విప్పుకొని.. కడలి జలాల్లోకి కదలనున్నాయి. వాటిని, వలలను రెడీ చేసుకున్న మత్స్యకారులు.. హైలెస్సో.. హైలెస్సా అంటూ నడి సంద్రానికి చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తమకు వలల నిండా మత్స్యసంపదనివ్వాలని.. తమ ఇంట సిరులు కురిపించాలని ఆ గంగమ్మను, తమ గ్రామ దేవతలను వేడుకుంటూ సముద్రంలో చేపల వేటకు బయలుదేరనున్నారు.

చేపల సంతానోత్పత్తి, మత్స్యసంపద వృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రంలో దాదాపు రెండు నెలల పాటు అమలు చేసిన చేపల వేట నిషేధం శుక్రవారం అర్ధరాత్రితో ముగియనుంది. ఈ వేట నిషేధాన్ని మత్స్యశాఖ అధికారులు ఏప్రిల్ 14 నుంచి విజయవంతంగా అమలు చేశారు. ఇది ముగియనుండటంతో ఇక నుంచి మత్స్యకారులు ఎటువంటి ఆంక్షలూ లేకుండా తమ బోట్లతో సముద్రంలో చేపల వేట చేసుకోవచ్చు. దీంతో జిల్లాలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సందడి నెలకొంది. చేపల వేట ద్వారా మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి సాగిస్తూండగా.. చేపల వ్యాపారంపై ఆధారపడి మరెందరో జీవనం సాగిస్తున్నారు. మాంసాహార ప్రియులు లొట్టలేసుకుంటూ తినే సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలు ఇక నుంచి అందుబాటులోకి రానున్నాయి. మన జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకూ ఎగుమతి కానున్నాయి.

94 కిలోమీటర్ల మేర సాగర తీరం

జిల్లాలో తొండంగి నుంచి తాళ్లరేవు వరకూ సుమారు 94 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో 58 మత్స్యకార ఆవాసాలున్నాయి. వీటిల్లో సుమారు 1,95,184 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో సముద్రంలో చేపల వేట ద్వారా 36,101 మంది ఉపాధి పొందుతున్నారు. వేటపై నిషేధం ఎత్తివేయనుండటంతో వీరందరూ నేటి నుంచి సముద్రంలో చేపల వేట సాగించుకోవచ్చు. జిల్లాలోని మత్స్యకారులు 410 మెకనైజ్డ్, 3,732 మోటారైజ్డ్ బోట్లతో పాటు 287 సంప్రదాయ పడవల ద్వారా సముద్రంలో చేపలు వేట సాగిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ కుంభాభిషేకం, కాకినాడ ఫిషింగ్ హార్బర్, ఉప్పాడ రేవులు ప్రసిద్ధి చెందాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 23 చోట్ల ఫిష్ ల్యాండింగ్ సదుపాయం ఉంది. మత్స్యకారులకు సేవలందించేందుకు కాకినాడలో కమ్యూనికేషన్ స్టేషన్ కూడా అందుబాటులో ఉంది.

వేట నిషేధ భృతి కోసం ఎదురుచూపులు

చేపల వేటే జీవనాధారంగా గడుపుతున్న గంగపుత్రులను వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటోంది. మత్స్యకార భరోసా పథకం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల చొప్పున వేట నిషేధ భృతి అందించింది. ఈ ఏడాది వేట నిషేధ సమయంలో లబ్ధిదారుల గుర్తింపును మత్స్యశాఖ అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 4,645 బోట్లకు గాను 24,147 మంది లబ్ధిదారులను మత్స్యకార భరోసా పథకం కింద ఎంపిక చేశారు. వీరికి కొత్త ప్రభుత్వం వేట నిషేధ భృతి అందించాల్సి ఉంది. ఈ భృతి కోసం లబ్ధిదారులైన మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

వేటకు సిద్ధమవుతున్నాం



రెండు నెలల విరామం తరువాత సముద్రంలో చేపల వేటకు సిద్ధమవుతున్నాం. వలలు, బోటు సిద్ధం చేసుకున్నాం. బోటులో ఐస్ వేసుకున్నాం. 15 లేదా 16న వేటకు బయలు దేరుతాం. ట్యూనా చేపలను వేటాడుతాం.

– ఎలకల గణేష్, మత్స్యకారుడు, పర్లోపేట, కాకినాడ

పక్కాగా వేట నిషేధం



సముద్రంలో చేపల వేట నిషేధం పక్కాగా అమలు చేశాం. సంప్రదాయ బోట్లకు అనుమతి ఇచ్చాం. ఫైబర్, సోనా బోట్లకు అనుమతి ఇవ్వలేదు. నిషేధం ఉల్లంఘించి వేటకు వెళ్లిన వారిపై కేసులు నమోదు చేశారు. మత్స్యకారులు దాదాపు సహకరించారు.

– కొమ్ము కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి, కాకినాడ

బడిగంట మోగింది

- నామమాత్రంగా హాజరైన విద్యార్థులు
- బడి బయటి పిల్లల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వేసవి సెలవులు ముగిశాయి. 2024–25 నూతన విద్యా సంవత్సరం గురువారం ప్రారంభమైంది. బంగారు భవితకు బాటలు వేసుకోవాల్సిన వేళ కావడంతో ఉదయం 9 గంటలకు బడి గంట మోగగానే విద్యార్థులు వడివడిగా పాఠశాలలకు చేరుకున్నారు. తరగతి గదుల్లో కూర్చుని, స్నేహితులను కలుసుకుని సంబరపడ్డారు. మొదటి రోజే స్టూడెంట్ కిట్లు అందుకున్నారు. చేతికందిన కొత్త పుస్తకాలను ఆనందంతో చూసి, మురిసిపోతూ.. వాటిని చిరునవ్వుతో అలా అలా తిరగేస్తూ.. ఆ పేజీల నుంచి వచ్చే పరిమళాన్ని ఆస్వాదించారు. మధ్యాహ్నం పోషణ అభియాన్ గోరుముద్ద భోజనం తిన్నారు. తొలి రోజు ఉపాధ్యాయులు ఒకవైపు అడ్మిషన్లు.. మరోవైపు తరగతులు నిర్వహిస్తూనే స్టూడెంట్ కిట్లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా బడి బయటి పిల్లలను గుర్తించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ కూడా నిర్వహించారు.

తొలి రోజు అంతంత మాత్రం

వాస్తవానికి వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రి మండలి ప్రమాణ స్వీకారం కారణంగా ఒక రోజు ఆలస్యంగా గురువారం ప్రారంభించారు. చాలా పాఠశాలల్లో తొలి రోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రధానోపాధ్యాయులు అసెంబ్లీ నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా కొనసాగించేందుకు అనుసరించాల్సిన బోధన పద్ధతులపై ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయని, జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకూ స్టూడెంట్ కిట్లు అందజేశామని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,38,278 విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేయాల్సి ఉంది. జిల్లాలోని 21 మండలాల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బెల్టులు మాత్రమే పూర్తి స్థాయిలో చేరుకున్నాయి. ఇంకా షూస్, యూనిఫాం, స్కూల్ బ్యాగులు, సాక్సులు, డిక్షనరీలు రావాల్సి ఉంది.

జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన 1,580 పాఠశాలలున్నాయి. వీటిల్లో గత విద్యా సంవత్సరం దాదాపు 1.49 లక్షల మంది విద్యార్థులున్నారు. గత ప్రభుత్వ హయాంలో మన బడి నాడు–నేడు పథకంలో పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో గత ఏడాది అధికంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈసారి కూడా విద్యార్థుల చేరికలు భారీగా ఉంటాయని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 1.45 లక్షల మంది అభ్యసిస్తున్నారు.

ప్రతి విద్యార్థీ పాఠశాలకు రావాలి



ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైనందున విద్యార్థుల చేరికలు పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. బడి బయటి పిల్లల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు సోమవారం నుంచి శుక్రవారం వరకూ ప్రతి రోజూ కోడిగుడ్డు, సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కీ, మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ అందించాలి.

– పిల్లి రమేష్, జిల్లా విద్యా శాఖాధికారి, కాకినాడ

కాకినాడ రూరల్ గైగోలుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ రమేష్



యనమదలకు కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారం

కాకినాడ క్రైం: సాహితీ సేవలో తరించిన నిష్ణాతులకు ఘన సత్కారం లభించింది. రాష్ట్రంలో సాహిత్య, కవితా ప్రక్రియల్లో రాణిస్తున్న ఆదర్శవంతులను కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారం వరించింది. అవార్డులు పొందిన కొద్ది మందిలో జిల్లాకు చెందిన కాకినాడ వాసి, సాంక్రమిక వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ యనమదల మరళీకృష్ణ ఉండడం విశేషం. చిత్తూరులోని రాజ్‌మహల్‌లో బుధవారం రాత్రి జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కుప్పం రెడ్డెమ్మ సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ మురళీకృష్ణ అందుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త కట్టమంచి బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుప్పం రెడ్డెమ్మ సాహిత్య అవార్డ్స్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ రోజా ప్రియ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిరంజన్‌రెడ్డితోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి సాహితీ ప్రియులు హాజరయ్యారు. వారందరూ యనమదల మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.



కుప్పం రెడ్డెమ్మ సాహిత్య అవార్డును అందుకుంటున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణ

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

- మీడియా ముసుగులో బెదిరింపులు
- రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- పోలీసులకు నిర్మలగిరి డైరెక్టర్ ఫిర్యాదు

దేవరపల్లి: మీడియా ముసుగులో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్ పీటర్ పోలీసులను ఆశ్రయించారు. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. పుణ్యక్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. మీడియా ముసుగులో కొంత మంది వ్యక్తులు ఈ నెల 8వ తేదీ నుంచి తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ చేస్తూ రూ.10 లక్షలు ఇవ్వాలని, కనీసం రూ.2 లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే పుణ్యక్షేత్రం గురించి ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో అసత్య ప్రచారం చేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను కిడ్నాప్ చేస్తామంటున్నారని, అర్ధరాత్రి సమయంలో ఫోన్ కాల్స్ వస్తున్నాయని, ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతోందని తెలిపారు. ఫోన్ కాల్స్ డేటా తమ వద్ద ఉందన్నారు. దీనిపై జిల్లా ఎస్పీకి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. తనను బెదిరించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనపై బిషప్ కౌన్సిల్‌కు కూడా సమాచారం ఇచ్చానని పీటర్ చెప్పారు. పుణ్యక్షేత్రం పూర్వపు డైరెక్టర్, ఏలూరు బిషప్ కౌన్సిల్ సభ్యుడు రెవరెండ్ ఫాదర్ దిరిసిన ఆరోన్ మాట్లాడుతూ, తాను 1992 నుంచి 2015 వరకూ ఇక్కడ డైరెక్టర్‌గా పని చేశానన్నారు. అప్పట్లో కూడా ఇదే విధంగా కొంత మంది మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడేవారని తెలిపారు. కొంత మంది రాత్రి వేళ వచ్చి డబ్బులు డిమాండ్ చేసేవారని, తాను ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డానని చెప్పారు. పుణ్యక్షేత్రం ద్వారా భక్తితో పాటు విద్య, వైద్యంతో పాటు ఉచిత భోజనం, వృద్ధాశ్రమం, పేదలకు ఇళ్ల నిర్మాణం, పేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై బిషప్ జయరావు పొలిమెర ఆధర్యంలో కౌన్సిల్ చర్యలు తీసుకుంటుందన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జాన్ పీటర్, ఫాదర్ ఆరోన్

రక్తదాత.. ప్రాణప్రదాత

- ఆపద సమయంలో అండ
- అరుదైన గ్రూపు రక్తం కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో 60 వేల మంది రక్తదాతలు
- నెలకు సుమారు 5 వేల యూనిట్ల రక్తం సేకరణ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏ వస్తువునైనా మనిషి తన తెలివితేటలతో తయారు చేయగలడు. వాటిని డబ్బుతో కొనుగోలు చేయగలడు. కానీ, మనిషి రక్తాన్ని మాత్రం కృత్రిమంగా సృష్టించడం సాధ్యం కాదు. దీనిని కేవలం మరో వ్యక్తి నుంచి మాత్రమే సేకరించాలి. అందుకే రక్తదానానికి అంతటి ప్రాధాన్యం ఏర్పడింది. దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. మనం దానం చేసే రక్తపు బొట్టు.. ఓ మహిళ నుదుట బొట్టును కాపాడటంతో పాటు.. ఓ తల్లి కడుపు తీపిని.. ఓ తండ్రి ఆవేదనను పోగొట్టే మంత్రం కావచ్చు. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు రక్తం అవసరం ఉంటుంది. అటువంటి సందర్భాల్లో పలువురు దాతలు ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించి, రక్తదానం చేస్తున్నారు. ఇటీవల రక్తం అవసరమైన వారు సోషల్ మీడియాలో సైతం విన్నపాలు చేస్తుండగా.. అలాంటి వారి కోసం ఎంతో మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా దీనిపై యువతలో అవగాహన వచ్చింది. వాట్సాప్ గ్రూపుల్లో చురుకుగా ఉంటూ ఎవరికి అవసరమైనా వెళ్లి రక్తం ఇస్తున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో బ్లడ్ బ్యాంకుల వివరాలు

జిల్లా	రక్తదాతల సంఖ్య	ప్రభుత్వ, ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు	సేకరిస్తున్న రక్తం (యూనిట్లు)
తూర్పు గోదావరి	19,000	7	1,600
కాకినాడ	22,500	9	1,800
కోనసీమ	18,500	7	1,500

రక్తదానంతో ఇదీ మేలు

- ఒక వ్యక్తి శరీరంలో దాదాపు పది యూనిట్ల రక్తం ఉంటుంది. రక్తదానం సందర్భంగా ఒక యూనిట్ దానం చేస్తారు.
- ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి మూడు నెలలకోసారి చొప్పున ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చు.
- మనిషి రక్తంలో ప్లాస్మా, ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్లు ఉంటాయి.
- రక్తంలోని ఎర్ర రక్త కణాలను రెండు నెలలకోసారి దానం చేయవచ్చు.
- ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయడం వల్ల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా పెద్ద పేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు క్యాన్సర్లు రాకుండా కాపాడుకోవచ్చు.
- గుండె సంబంధిత వ్యాధుల నివారణకు తరచూ రక్తదానం చేయడం మంచిది.
- రక్తపోటును నియంత్రించడానికి రక్తదానం దోహదపడుతుంది.
- ఏడాదికి రెండుమూడుసార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు.
- 18 ఏళ్లు నిండి 65 సంవత్సరాల లోపు వయస్సు వారు రక్తదానం చేయవచ్చు.
- రక్తదానం చేసే ప్రతి ఒక్కరూ 45 కిలోల బరువు కలిగి ఉండాలి. అంతకంటే తక్కువ బరువు ఉన్న వారు రక్తదానం చేయకపోవడం మంచిది.
- దాత శరీర ఉష్ణోగ్రత, బీపీ, పల్స్ రేట్ వంటివి సాధారణ స్థాయిలో ఉండాలి. వారి రక్తంలో హిమోగ్లోబిన్ 12.6 శాతం తప్పనిసరిగా ఉండాలి.
- రక్తదానం చేసే ముందు చేసే దాత ఆరోగ్య స్థితిని వైద్యులు పరీక్షిస్తారు.
- సేకరించిన రక్తం 30 రోజుల వరకూ నిల్వ ఉంటుంది.
- రక్తదానం సన్నగా ఉన్నవారు చేయకూడదని, లావుగా ఉన్న వారే చేయాలనేది అపోహ మాత్రమే.
- రక్తదానం చేస్తే బలహీనపడతారని, హెచ్ఐవీ సోకుతుందని, రక్తహీనత వస్తుందనే వాదన కూడా సరికాదు.

రక్తదాతల దినోత్సవం ఎందుకంటే..

కారల్ ల్యాండ్ స్టీనర్ అనే జీవ శాస్త్రవేత్త మానవ రక్త కణాలను కనుగొన్నారు. దీనికి గాను ఆయనకు వైద్య శాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతిను పురస్కరించుకుని, రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

రక్తదానం ఎవరు చేయకూడదంటే..



- శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్, గుండె జబ్బులు, ఉన్నట్టుండి బరువు తగ్గిన వారు, డయాబెటిక్, హెపటైటిస్, ఆస్తమా, ఎపిలెప్సీ, కాలేయ వ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయరాదు.
- మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు చికిత్స పొందిన వారు, శస్త్రచికిత్స చేయించుకున్న వారు, రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకూ రక్తదానం చేయడానికి వీలు లేదు.
- దగ్గు, జలుబు, జ్వరం వంటి అస్వస్థతతో బాధ పడుతున్న వారు, ఏదైనా చికిత్సలో భాగంగా మందులు వాడుతున్న వారు ఆ విషయాల్ని వైద్యులకు చెప్పాలి. వారు ఎప్పటి వరకూ రక్తదానం చేయరాదనే విషయాన్ని వైద్యులు చెబుతారు.

61 సార్లు రక్తదానం



ఇప్పటి వరకూ 61 సార్లు రక్తదానం చేశాను. కేంద్రం నుంచి ఇందిరాగాంధీ ఎన్ఎస్ఎస్ అవార్డు అందుకున్నాను. మా విద్యార్థులు 80 మంది ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రి, నగరంలోని బ్లడ్ బ్యాంకుల్లో రక్తదానం చేస్తుంటారు. గాంధీ జయంతి, తలసేమియా డే వంటి సందర్భాల్లో మా కళాశాల విద్యార్థులతో రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తుంటాం. రక్తదానం చేయడం వలన నేనెప్పుడూ ఉత్సాహంగా ఉంటాను.

– జీవీఎస్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం

79 సార్లు చేశాను



నేను ఇప్పటి వరకూ 79 సార్లు రక్తదానం చేశాను. అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి నేటి వరకూ క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూనే ఉన్నాను. తొలినాళ్లలో మిత్రులతో కలిసి సరదాగా, ఇష్టంగా రక్తదానం చేశాను. వయసు పెరుగుతున్నకొద్దీ సామాజిక బాధ్యతగా అవసరమైనవారికి రక్తదానం చేయడం అలవాటుగా మారింది. మూడుసార్లు ప్లేట్‌లెట్లు ఇచ్చిన నాకు ఎప్పుడూ నీరసం, అలసట లేవు. పైగా ఆ రోజు మరింత సంతోషంగా నా పనులు చేసుకుంటాను. రాజమండ్రి జైన్ సేవా సమితి తలసేమియా బాధిత చిన్నారులకు ఏటా నిర్వహించే శిబిరంలో క్రమం తప్పక రక్తదానం చేస్తాను. నాతో పాటు నా భార్య, బిడ్డ, నా స్నేహితులు రక్తదానం చేయడం ఆనందంగా ఉంటుంది.

– కె.ధర్మ, మందుల దుకాణం, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గోపాలపురం: చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు దేవరపల్లి సీఐ కె.బాలసురేష్ గురువారం తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి మణికంఠ చౌదరి(30) అప్పుల బాధ తాళ లేక గ్రామశివారులోని కోడూరి వెంకటరమణ గోదాము వద్ద ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ చెప్పారు.

దామాషా పద్ధతిలో ఎన్నుకొంటే వైఎస్సార్ సీపీ గెలిచేది

ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలు దామాషా పద్ధతిలో జరగాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలకు వచ్చిన ఓట్లను దామాషా ప్రకారం లెక్క కడితే, ఆ విధానమే అమలులోకి వస్తే రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలిచేది. ఆ పార్టీ ప్రభుత్వమే వచ్చి ఉండేదని పేర్కొన్నారు. ఈ మేరకు సూర్యనారాయణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 4,08,07,256 ఓట్లు నమోదు కాగా సుమారు 3.25 కోట్ల ఓట్లు పోలయ్యాయని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీకి 1,32,84,134, ఎన్డీఏ కూటమికి 1,53,84,576 మంది ఓట్లు వేశారన్నారు. ఎన్డీఏ కూటమి మూడు పార్టీలకు, వైఎస్సార్ సీపీకి పడ్డ మొత్తం ఓట్లు 2,86,68,710 అయితే ఇండియా కూటమికి, ఇతరులకు వచ్చిన ఓట్లు 38,31,290 మాత్రమేనని పేర్కొన్నారు. పోలైన మొత్తం ఓట్లను 175 (నియోజకవర్గాలు)తో భాగిస్తే ఒక్కో అభ్యర్థికి సరాసరిన 1,85,714 ఓట్లు వచ్చేవన్నారు. దీని ప్రకారం వైఎస్సార్ సీపీకి 72 సీట్లు, ఎన్డీఏ కూటమికి 82 సీట్లు, ఇండియా కూటమికి 20 సీట్లు, ఇతరులకు ఒక్క సీటు వస్తుందని పేర్కొన్నారు. ఇండియా కూటమి ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వదు. అప్పుడు ఇండియా కూటమి వైఎస్సార్ సీపీకి మద్దతు ఇస్తే దాని బలం 92 అవుతుంది. అంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఏర్పడేదని తెలిపారు. దామాషా పద్ధతిలో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లను బట్టి సీట్లు కేటాయించడమే అసలైన ప్రజాస్వామ్యమని రాజకీయ విశ్లేషకులు, సంస్కరణవాదులు భావిస్తున్నారని తెలిపారు.

ఘాటెక్కిన రేటు

- కిలో రూ.65 పలుకుతున్న ఉల్లి
- పది రోజులుగా పైపైకి ఎగబాకుతున్న ధర
- మహారాష్ట్ర నుంచి జిల్లాకు తగ్గిన దిగుమతులు
- ఉమ్మడి తూర్పులో రోజుకు 900 టన్నుల వినియోగం



ఆలమూరులో ఆటోలపై నాసికరం ఉల్లిపాయలను విక్రయిస్తున్న వ్యాపారి



ఆలమూరు: దైనందిన జీవితంలో ప్రధానంగా వినియోగించే నిత్యావసర వస్తువుల్లో ఒకటైన ఉల్లి ధర రోజు రోజుకు ఘాటెక్కుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనున్న రిటైల్ మార్కెట్లలో ఉల్లి ధర పది రోజులుగా దాదాపు సుమారు మూడు రెట్లు పెరిగి వినియోగదారులకు చుక్కలు చూపిస్తోంది. ఉల్లి ఎక్కువగా పండించే మహారాష్ట్రలో కొత్త పంట అందుబాటులోకి రాకపోవడంతో పాటు పాత నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఉల్లి ప్రధాన మార్కెట్లైన రాజమహేంద్రవరం, మడికి, రావులపాలెం, చొప్పెల్ల, రాజోలు తదితర హోల్‌సేల్ మార్కెట్లలో దిగుమతులు అంతంతమాత్రంగానే ఉండటం ధరలు పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా ఉల్లి సాగు లేకపోవడంతో దిగుమతులపైన ఆధార పడవలసిన పరిస్థితి ఏర్పడటం కూడా ధరలు పెరుగుదలకు కారణం.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు సుమారు దాదాపు 900 టన్నుల ఉల్లిపాయల అవసరం అవుతుంది. మహారాష్ట్రలోని నాసిక్, సోలాపూర్, నాందేడ్, నాగపూర్, కామత్ నగర్ ప్రాంతాల నుంచి ప్రతి రోజు రాజమహేంద్రవరం, రావులపాలెం, రాజోలు, మడికి, చొప్పెల్ల మార్కెట్ల సుమారు 30 లారీల్లో కేవలం 600 టన్నుల మాత్రమే సరఫరా జరగుతోంది. దిగుమతి జరిగే ఆయా ప్రాంతాల్లో వ్యాపారుల వద్ద ఉల్లి నిల్వలు గణనీయంగా తగ్గడంతో డిమాండ్‌కు సరఫరాకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడి ఉల్లి పెరిగి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జూన్ నెల ప్రారంభంలో రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.25 ఉన్న ధర ప్రస్తుతం రూ.65కు చేరుకుంది. చిరు వ్యాపారులు ఆటోలపై ఇళ్ల వద్దకు వచ్చి కొంచెం నాసిరకంగా ఉన్న ఉల్లిపాయలు మూడు కిలోలు రూ.100కు విక్రయిస్తున్నారు.

కూరగాయల ధరలు కూడా పైపైకి

వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల కొద్దిరోజులుగా కూరగాయలు ధరలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పటికే ఉల్లి, పచ్చిమిర్చి ధరలు ఆకాశన్నంటుతుండగా మిగిలిన కూరగాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల పూత మాడిపోయి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో గోదావరి లంకల్లోను, చాగల్నాడు, మెట్టలోను సాగుచేసే కూరగాయల పంటలకు తీవ్రం నష్టం వాటిల్లింది. వారం రోజులుగా కూరగాయలు దాదాపు రెట్టింపయ్యాయి. దుంప కూరలు కంద, పెండ్లం, బంగాళా దుంప, బీట్‌రూట్, క్యారెట్, చామదుంప వంటి దుంపకూర ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

ఉల్లి ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది



ఉల్లి దిగుమతులు రోజు రోజుకు తగ్గిపోవడంతో జిల్లాలో ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో ఈ నెలాఖరు నాటికి గాని కొత్త పంట అందుబాటులోకి రాదు. అప్పటి వరకూ ధరలు అదుపులోకి రావు.

– చెల్లుబోయిన సింహాచలం, హోల్‌సేల్ వ్యాపారి, మడికి, ఆలమూరు మండలం

విక్రయాలు తగ్గిపోయాయి



ఉల్లి ధరలు పెరిగి పోవడంతో విక్రయాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. కూరగాయల ధరలు కూడా ఇదే విధంగా ఉండటంతో వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో ధరలు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నాం.

– యనామాల వెంకటేశ్వర్లు, వ్యాపారి, పినపళ్ల

కొమ్మనాపల్లిలో డయేరియాతో పలువురికి అస్వస్థత



ఏ.వి.నగరంలో రోగులను పరామర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో డయేరియా ప్రభావంతో ప్రజలు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలయ్యారు. గ్రామస్తులు, బాధితులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం కోన తాతారావు, కోన చరణ్, కోన శివ, కోన వరలక్ష్మి, కుర్రా కృష్ణ, కుర్రా రామ్మోహన్‌రావు, సుంకర శ్రీనులతో పాటు మరికొంత మంది రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారంతా కత్తిపూడి, కాకినాడ, అచ్చంపేట ఆస్పత్రులలో వైద్యం పొందుతున్నారు. గ్రామంలో తాగునీరు కలుషితం కారణంగానే డయేరియా ప్రబలిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత ఏ.వి.నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్, పి.భారతి గ్రామంలో పర్యటించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. రోగుల వివరాలు సేకరించారు. 13 కేసులు నమోదు అయినట్టు వైద్యాధికారి రవికుమార్ తెలిపారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించి, డయేరియా నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న రోగులను డీఈంఅండ్‌హెచ్‌వో సరిత పరామర్శించారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఖాళీ స్థలాల విక్రయానికి టెండర్లు

- త్వరలో 4జీ సేవలు అందుబాటులోకి
- ఏజెన్సీ ప్రాంతంలో 400 టవర్ల ఏర్పాటు
- జనరల్ మేనేజరు పలివెల రాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రాజు

తుని: రాజమండ్రి బీఎస్‌ఎన్‌ఎల్ సర్కిల్ పరిధిలో నిరుపయోగం ఉన్న ఖాళీ స్థలాల విక్రయానికి ఈ టెండర్లు పిలిచామని జనరల్ మేనేజరు పలివెల రాజు తెలిపారు. గురువారం తుని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తుని పట్టణం బ్యాంకుకాలనీలో 6,377 చదరపు మీటర్ల స్థలం, పాలకొల్లు, కొండపల్లిలోని స్థలాలకు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు స్థలాల కొనుగోలుకు ముందుకు రావాలన్నారు. స్థలాల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని నూతన సాంకేతిక పరిజ్ఞానానికి వినియోగిస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 400 సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వచ్చే ఏడాది 5జీ సేవలు వినియోగదారులకు అందిస్తామన్నారు. టీసీఎస్ సహకారంతో స్వదేశీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, 700 మెగా హెడ్జ్ స్పీడ్ అందుబాటులోకి రావడం వల్ల ఎక్కువ దూరం సిగ్నల్ వస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న ఎక్స్ఛేంజ్‌లో కాపర్ కేబుల్స్ ఉన్నాయని, వీటిని ఫైబర్ టెక్నాలజీకి మార్పు చేస్తామన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను విస్తృతం చేసేందుకు ప్రవేటు భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తామన్నారు. సర్కిల్ పరిధిలో 81 ఎక్స్ఛేంజ్‌లు ఉండగా 11,200 కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. సర్కిల్ పరిధిలో 293 మంది ఉద్యోగులు ఉన్నారని, ఏటా రూ.70 కోట్ల ఆదాయం వస్తోందని, రూ.80 కోట్ల వ్యయం అవుతోందన్నారు. డీజీఎం రాజశేఖర్‌బాబు, ఏజీఎం బి.శ్రీనివాస్, కాకినాడ డివిజనల్ ఇంజినీర్ ఈశ్వరరావు, తుని సబ్ డివిజనల్ ఇంజినీర్ ఆదినారాయణ, పీఆర్వో వాసు పాల్గొన్నారు.

ఉపాధి వేటలో అగ్నికి ఆహుతి

- కువైట్ అగ్ని ప్రమాదంలో పెరవలి మండలానికి చెందిన ఇద్దరి సజీవ దహనం
- 10 రోజుల్లో స్వదేశానికి రావటానికి అన్నీ సిద్ధం చేసుకున్న తరుణంలో వక్రించిన విధి
- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులు



అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరరావు



ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ

పెరవలి: పొట్టకూటి కోసం కువైట్ వెళ్లిన ఆ ఇద్దరిని అగ్ని ప్రమాదం పొట్టన పెట్టుకుంది. తమకు మంచి భవిష్యత్తు ఇద్దామని పరాయి దేశానికి ఉపాధికి వెళ్లినవారు.. ఇక తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారన్న నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో 10 రోజుల్లో మాతృదేశం వచ్చి తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుదామనుకున్న ఆ కార్మికులు ప్రమాదంలో సజీవ దహనమయ్యారు . ఇంటికి రావటానికి అన్నీ సిద్ధం చేసుకున్న తరుణంలో అగ్ని ప్రమాదం వారిని కబళించింది. ఈ దుర్వార్త విన్న భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన కువైట్ దక్షిణ అహ్మదీ గవర్నరేట్‌లోని మాంగాఫ్ ప్రాంతంలోని బహుళ అంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పెరవలి మండలంలోని ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాలకు చెందిన ఇద్దరు మృతి చెందారు. అన్నవరప్పాడు గ్రామానికి చెందిన మీసాల ఈశ్వరరావు (46), ఖండవల్లి గ్రామానికి చెందిన మొల్లేటి సత్యనారాయణ (44) కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆహుతి అయినట్టు అక్కడ ఉన్న తెలుగు వారు తెలియజేశారని కుటుంబ సభ్యులు గురువారం రాత్రి తెలిపారు. మీసాల ఈశ్వరరావుకి భార్య చిట్టి, కుమారుడు మీసాల సాయి, కుమార్తె కోమలి ఉన్నారు. మొల్లేటి సత్యనారాయణకు భార్య అనంతలక్ష్మి, కుమారుడు వెంకట సాయి ఉన్నారు. ఈ రెండు కుటుంబాల వారు వ్యవసాయ కూలీలు కాగా పొట్టకూటి కోసం వీరిద్దరూ కువైట్ వెళ్లారు. వీరు 10 ఏళ్లుగా అక్కడి మాల్‌లో సేల్స్‌మన్‌లుగా పనిచేస్తున్నారు. మొల్లేటి సత్యనారాయణకు భార్యా పిల్లలతో పాటు తల్లిదండ్రులు ముక్తేశ్వరరావు, రాఘవులు కొడుకుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొడుకు మృతి చెందాడన్న చేదు నిజం తెలిస్తే ఈ వృద్ధ తల్లితండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆ కుటుంబ సభ్యులు ఈ విషయం చెప్పడానికి ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు, బంధువులు ఆ రెండు గ్రామాలకు వచ్చి ఆ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్నారు.

52 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

రావులపాలెం: బిల్లులు, అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 52 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని రావులపాడు గ్రామంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్టు అందిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేశారు. 52 బస్తాలలో సుమారు 2,645 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. గ్రామానికి చెందిన సత్తి సతీష్ తణుకు పరిసర ప్రాంత గ్రామాల్లో మోటార్ సైక్లిస్టుల నుంచి కిలో రూ.20కు కొనుగోలు చేసి, కిలో రూ.22కు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సుమారు రూ.1,28,347 విలువ గల 2,645 కేజీల పి.డి.ఎస్ బియ్యాన్ని, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని సీజ్ చేసి 6–ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సత్తి సతీష్, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కోసం సిఫారసు చేశామన్నారు.

వేస్ట్ ఆయిల్ గోడౌన్‌లో మంటలు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం
- రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం



రావులపాడులో వేస్ట్ ఆయిల్ గోడౌన్ వద్ద అంటుకున్న మంటలు



దగ్ధమైన లారీ, కారు, షెడ్డు

రావులపాలెం: మండలంలోని రావుడుపాడు గ్రామంలో మెయిన్‌రోడ్డు శివారు ప్రాంతంలో పంట పొలాల్లో ఉంచిన వేస్ట్ ఆయిల్ గోడౌన్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో ఉన్న ఖాళీ ఆయిల్ డబ్బాలతో పాటు ఆ ప్రాంతంలో ఉంచిన టెన్ టైర్ల ట్యాంకర్, మినీ వ్యాన్, ఒక కారు మంటల్లో కాలి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కొత్తపేట అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే వేస్ట్ ఆయిల్ ఆ ప్రాంతంలో అంటుకుని ఉండటంతో చాలాసేపు మంటలు ఎగసి పడ్డాయి. నల్లటి పొగ ఆ ప్రాంతంలో కమ్ముకోవడంతో మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది శ్రమించారు. దీంతోపాటు మండపేట నుంచి మరో ఫైర్ ఇంజిన్‌ను రప్పించి పూర్తిస్థాయిలో మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రావులపాడు గ్రామానికి చెందిన నంబూరి రామ్ మురళీమోహన్ సమీప ప్రాంతాల్లో మెకానిక్ షెడ్ల నుంచి తీసివేసిన వేస్ట్ ఆయిల్‌ను సేకరించి గ్రీజు తయారీ కోసం ఎగుమతి చేస్తారన్నారు. ఈ క్రమంలో ఇక్కడ ప్రాసెసింగ్ చేసేందుకు షెడ్డు వద్ద ఆయిల్ డబ్బాలు, ఎగుమతికి వాహనాలు ఉంచారని చెప్పారు. షెడ్‌లో ఏర్పడిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయన్నారు. అయితే అధిక శాతం ఖాళీ డబ్బాలు ఉండడంతో ప్రమాద తీవ్రత పెద్దగా లేదన్నారు. ఈ ప్రమాదంలో రూ. పది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశామన్నారు. ఘటనా ప్రాంతాన్ని రావులపాలెం టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ పరిశీలించారు.

'చిటుకు'.. పారదోలే కిటుకు

- టీకాతోనే జీవాల్లో చిటుకు రోగం నియంత్రణ
- నిర్లక్ష్యంగా ఉంటే మొదటికే ప్రమాదం
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాలో 48వేల జీవాలు



పొలాల్లో మేతకు వచ్చిన గొర్రెలు



గొర్రెలకు చిటుక వ్యాధి టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

రాయవరం: తొలకరి పలకరించింది. భూమిపై గడ్డి చిగురిస్తోంది. ఆ గడ్డిపై నిద్రావస్థలో ఉన్న క్రిములు తొలకరి వర్షాలకు బలపడతాయి. జీవాలు తినే పచ్చగడ్డి ద్వారా క్రిములు లోపలకి వెళ్తాయి. దానివల్ల గొర్రెలు, మేకలు త్వరగా 'చిటుకు రోగం బారిన పడి నిమిషాల్లోనే మృత్యువాత పడతాయి. ఆవులకు, గేదెలకు జబ్బవాపు, గొంతువాపు టీకాల మాదిరిగానే చిటుకు రోగానికి సంబంధించి గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తారు. అందుకే 'చిటుకు' రోగంపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో గొర్రెలు, మేకలు 48వేల పైబడి ఉన్నాయి. వీటికి 'చిటుక' వ్యాధి సోకకుండా, నివారణకు ప్రభుత్వం ఇప్పటికే టీకాలు వేసే కార్యక్రమం అమలు చేస్తోంది. తొలకరికి ముందుగా గొంతు వాపు, జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాలు ప్రతి పశువైద్య కేంద్రం ద్వారా ఆవులకు, గేదెలకు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు వ్యాధి ఎప్పుడు వస్తుంది? లక్షణాలు ఎలా ఉంటాయి ? నివారణ పద్ధతులపై పెంపకందారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

వ్యాపించే విధానం

గొర్రెలు, మేకలకు గాలికుంటు, మశూచి, పీపీఆర్, చిటుకు రోగం, దొమ్మ, గొంతువాపు మొదలైన అంటువ్యాధులు త్వరగా సోకుతాయి. ఒక మంద నుంచి మరో మందకు అత్యంత వేగంగా, సులభంగా వ్యాపించి ప్రాణనష్టాన్ని కలిగిస్తాయి. చాలా సందర్భాల్లో చికిత్స చేసేందుకు తగిన వ్యవధి కూడా ఉండదు. ఇలాంటి ప్రమాదకర, ప్రాణాంతక వ్యాధులకు చికిత్స బదులు నివారణే ముఖ్యమైందని గుర్తించాలి. అంటు వ్యాధులు సోకక ముదే ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే గొర్రెలు, మేకల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ చిటుకు వ్యాధి మేకలకన్నా గొర్రెలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు..

వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించాలి. అకాల వర్షాలు, తొలకరి వర్షాలకు పెరిగిన గడ్డిని తినడం వల్ల వస్తుంది. వరి కోసిన తర్వాత ఎక్కువగా మేపకూడదు. గొర్రెలు, మేకలకు మూడు నెలలకోసారి నట్టల నివారణ మందు వేయాలి. 30 రోజుల వయసు కలిగిన గొర్రెలు, మేక పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. వ్యాధి కారక బ్యాక్టీరియా విడుదల చేసే ట్యాక్సిన్స్ విష పదార్థం విడుదల కావడంతో ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన గొర్రె గిర్రున గాలిలో ఎగిరి కింద పడి మరణిస్తుంది. చిటికెలో జీవాలు చనిపోతాయి కనుకనే చిటుక వ్యాధిగా పేర్కొంటున్నారు.

వ్యాధి లక్షణాలు

రాత్రి బాగా ఉండి తెల్లవారే సరికల్లా ఎక్కువ సంఖ్యల్లో జీవాలు మృత్యువాత పడుతుంటాయి. కళ్ల ముందే ఎలాంటి లక్షణాలు లేకుండా హఠాత్తుగా గాలిలోకి చెంగున ఎగిరి కిందపడి మరణిస్తాయి. జ్వరం, పళ్లు కొరకడం, వణకడం, బిగుసుకుని పోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండడం, కాళ్లు బిగిసి పట్టి నడవడం, శ్వాస కష్టమవడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత దశలో అధిక విరేచనాలు, కడుపు నొప్పి, మందకొడిగా ఉండడం, సరిగ్గా మేయకపోవడం వంటి లక్షణాలుంటాయి.

నివారణతో 'చిటుకు' అంతం



చిటుకు వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించాలి. వ్యాధి సోకక ముందే నిరోధక టీకాలు వేయిస్తే జీవాల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జిల్లాలో టీకాలు వేయడం ప్రారంభించాం. అన్ని పశువైద్య శాలలు, ఆర్‌బీకేల్లో తగినన్ని టీకాలు అందుబాటులో ఉన్నాయి. గొర్రెలు, మేకల యజమానులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

పోరాటాలకు సిద్ధపడాలి

ఐఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న టాన్యా. హాజరైన నాయకులు

మండపేట: కార్మిక హక్కులపై ఫాసిస్టు ప్రభుత్వాల దాడులకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధపడాలని పలువురు ఐఫ్‌టీయూ నాయకులు పిలుపు నిచ్చారు. ఐఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం గురువారం స్థానిక నాళం చినభీమయ్య సత్రంలో జరిగింది. తొలుత ఐఫ్‌టీయూ సంస్థాగత అమరవీరుల ఎర జెండాను రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు ఎగురవేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ అధ్యక్షత వహించిన సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (ఏపీసీఎల్‌సీ) వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రైవేటీకరణ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులు కార్మికులను కృత్రిమ యంత్రాలుగా మార్చేశాయని చెప్పారు. దేశంలో 40 కోట్ల మంది పైగా అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ, రైస్ మిల్లు, జూట్ మిల్లు, జనపనార, సిమెంట్, సామిల్లు, ఇటుక బట్టీ, రిక్షా కార్మికులుగా, సినిమా థియేటర్లు, రెస్టారెంట్లలో కూలీలుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జాతీయ కార్యదర్శి పి.టాన్యా మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్లలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను 99%శాతం ప్రైవేటుపరం చేశారన్నారు. 8 గంటల పనిని 12 గంటలుగా మార్చారని అన్నారు. ఐఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, పీఓడబ్ల్యూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ విజయ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు, మైనార్టీ నాయకుడు రహీమ్ ప్రసంగించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి వి.భీమ శంకరం, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా నాయకులు బి.సిద్ధూ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు పాల్గొన్నారు.